క్లుప్తంగా

కాలేరులో 50 మందికి కంటి పరీక్షలు


కాలేరులో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద మండలంలోని కాలేరు గ్రామంలో మంగళవారం 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 20 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఐదుగురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో ఆరోగ్య కార్యకర్త పుష్ప, ఆశ కార్యకర్తలు రాణి, నిర్మల, శిరీష సేవలందించారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రుకు వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాత నూకారావు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో గ్రామానికి కాకినాడ డిపో నుంచి ఆర్టీసీ బస్సు రోజుకి నాలుగుసార్లు వచ్చి వెళ్లేదన్నారు. ఇటీవల నష్టాల పేరుతో ఆర్టీసీ అధికారులు బస్సు రూటును రద్దు చేశారు. దీంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ బస్సురూటును పునరుద్ధరించాలన్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు


అన్నదానంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కె.గంగవరం: స్థానిక రామాలయం వద్ద గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవాలు నేటితో ముగిశాయి. కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ప్రతి రోజు భజనలు, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మసీదు స్థలంలో నిర్మాణం తొలగించాలి

మండపేట: మసీదు స్థలంలో చేసిన అనధికార నిర్మాణాలు తొలగించాలని వక్ఫ్ బోర్డు మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చినట్టు డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలోని జామీయ మసీదు స్థలాన్ని ఆక్రమించి చేస్తున్న అనధికార నిర్మాణంపై చేసిన ఫిర్యాదు మేరకు వక్ఫ్ బోర్డు సీఈఓ ఎల్ అబ్దుల్‌ఖాదీర్ ఆదేశాలిచ్చినట్టు మంగళవారం కామన మీడియాకు తెలిపారు.

కలుపు మందు తాగి వృద్ధుడి మృతి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకకు చెందిన వృద్ధుడు తెలగాని సత్యం (78) సోమవారం రాత్రి కలుపు నివారణ మందు తాగి మృతి చెందాడు. అంగర ఎస్సై జి. చంటి కథనం ప్రకారం.. మృతుడు సత్యం కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక సోమవారం కలుపు నివారణ మందు తాగాడు. ఇంటి అరుగుపై వాంతులు చేసుకుంటుండగా కుమారుడు తెలగాని సుబ్రహ్మణ్యం గమనించి కొత్తపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే రోజు మృతిని మరో కుమారుడు తెలగాని సత్య వర్ధనరావు ఇచ్చిన ఫిర్యాదుపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి ఫిలాటికల్ స్టాంపుల ప్రత్యేక కౌంటర్

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో రెండు రోజుల పాటు తపాలా కవర్ల ఫిలాటికల్ ప్రత్యేక కౌంటర్‌ను నేటి నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ తపాలా శాఖ ఘనమైన వారసత్వానికి ప్రతీకగా నిలిచే పోస్టల్ స్టాంప్‌లు కాలానుగుణంగా ఎన్నో రూపాలను సంతరించుకుందని, తన ప్రత్యేకతను చాటుకుంటూ పలు చారిత్రక సందర్భాలు, మహనీయుల జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఎన్నో పోస్టల్ స్టాంపులను ముద్రించిందని తెలిపారు. ప్రత్యేక సందర్భాల్లో విడుదల చేసిన స్టాంపులను ఫిలాటికల్ స్టాంపులుగా పరిగణిస్తారని ఆయన తెలిపారు. ఒక ప్రత్యేక కౌంటర్ ద్వారా రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయంలో బుధవారం, గురువారం అపురూపమైన విలువైన పోస్టల్ స్టాంపులను విక్రయిస్తామన్నారు. అభిరుచి కలిగిన ఫిలాటికలిస్టులు, విద్యార్థులు, ఆసక్తి కలిగిన వారు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తీరనున్న రోడ్డు వెతలు


ప్రారంభానికి ముందు అధ్వానంగా ఉన్న గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు


వెడల్పు చేసిన అనంతరం గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు

- గొల్లపాలెం, కుయ్యేరు రోడ్డుకు మహర్దశ
- మంత్రి వేణు చొరవతో రూ.37 కోట్లు మంజూరు
- రోడ్డు రెండింతల వెడల్పు, కల్వర్టులు, వంతెనల పునర్నిర్మాణం
- దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డుకు మహర్దశ పట్టనుంది. నాడు ఇరుకు వంతెనలతో శిథిలదశకు చేరుకున్న ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.37 కోట్లు మంజూరు కావడంతో రోడ్డు రెండింతల వెడల్పుతో కల్వర్టులు, వంతెనలు పునర్నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఎప్పుడో 80 సంవత్సరాల క్రితం అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఈ రహదారి శిథిలావస్థకు చేరుకుని ప్రస్తుత జనాభా అవసరాలు తీర్చలేక సతమతమవుతోంది. సుమారు 20 సంవత్సరాలుగా మరమ్మతులకు కూడా నోచుకోని ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజులూరు, దుగ్గుదూరు గ్రామాల మధ్య అంద్రంగి డ్రైన్‌పై వున్న వంతెన సుమారు ఐదేళ్ల క్రితం కుప్పకూలిపోయింది. పక్కనే తూములు వేసి ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టుపై రాకపోకలు సాగిస్తూ ఇటీవల ట్రాక్టరు, లారీ, జేసీబీ వంటి భారీ వాహనాలు సైతం డ్రైన్‌లోకి పల్టీకొట్టాయి. ఈ రహదారిలో ఉన్న పలు కల్వర్టులతో పాటు కోరంగి కెనాల్‌పై ఉన్న చేదువాడ వంతెన, కూరాడ డ్రైన్ పై ఉన్న మొగలిపాలెం వంతెన శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా తయారయ్యాయి. మండలంలో 26 గ్రామాలకు 20 గ్రామాల ప్రజలు బయట ప్రపంచానికి రావాలంటే ఈ రోడ్డుపై ప్రయాణించక తప్పదు. రోడ్డు పొడవునా నిలువెత్తు గోతులతో ఈ రహదారి పై ప్రయాణం ఆసుపత్రికే పయనం అన్న చందంగా మారింది. అయితే రహదారి పరిస్థితిపై స్పందించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ రోడ్డు అభివృద్ధికి రూ.37 కోట్లు మంజూరు చేయించటంతో మండల గ్రామాల ప్రజల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. 3.6 మీటర్ల వెడల్పుతో ఉన్న రహదారిని 7 మీటర్ల వెడల్పుతో డబుల్ రోడ్డుగా చేయడంతో పాటు గ్రామాల్లో 3.16 కిలోమీటర్లు సీసీ రోడ్డుగా మిగిలింది. దుగ్గుదుర్రు, చేదువాడ, మొగలిపాలెం వంతెనలతో పాటు 42 కల్వర్టులను పునర్నిర్మిస్తున్నారు. గొల్లపాలెం నుంచి కుయ్యేరు వరకూ రోడ్డు వెడల్పు పనులు, గొల్లపాలెంలో రోడ్డుకి ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కూరాడ డ్రైన్‌పై మొగలిపాలెం సెంటర్‌లో నిర్మిస్తున్న వంతెన పనులు మూడొంతులు పూర్తి కావచ్చింది. ఇక రోడ్డు పొడవునా సీసీ, బీటీ రోడ్డు నిర్మాణం, కాజులూరు, దుగ్గుదూరు గ్రామాల మధ్య అంద్రంగి డ్రైన్‌పై వంతెన, కోరంగి కెనాల్‌పై ఉన్న చేదువాడ వంతెన నిర్మాణం పనులు జరగాల్సి ఉంది. మొత్తం పనులు పూర్తయితే ఈ రహదారిపై ప్రయాణం ఎంతో సులభంగా మారుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఇరుకిరుకు వంతెనలు, శిథిలావస్థకు చేరిన రహదారితో దశాబ్దాల కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న ప్రభుత్వం దయవల్ల రోడ్డు, వంతెనలు పునర్నిర్మాణం కావడమే కాకుండా రోడ్డు వెడల్పు జరిగి డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చెందనుంది. ప్రభుత్వానికి, నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి వేణుగోపాలకృష్ణకు మండల గ్రామాల ప్రజలు రుణపడి ఉంటాం.

– వనుం వెంకట సుబ్బారావు, జెడ్పీటీసీ, కాజులూరు

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం



కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజల జీవన ప్రమాణాలు కాపాడేందుకు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్లను విస్మరిస్తుందంటూ ప్రతిపక్షాలు అర్థం, పర్థం లేని రాద్ధాంతం చేశాయి. నేడు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. 13 కిలోమీటర్ల పొడవున శిథిలావస్థలో ఉన్న గొల్లపాలెం, కుయ్యేరు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మంత్రి

తాగునీటిపై ముందస్తు చర్యలు చేపట్టాలి

కాజులూరు: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ అన్నారు. కరప, కాజులూరు మండలాల్లో 24 గ్రామాలకు తాగునీరందించే గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం శంకర నారాయణ తదితర బీజేపీ నేతలు సందర్శించి నీటి నిల్వలు, క్లోరినేషన్, ఫిల్టర్‌బెడ్ల నిర్వహణ తదితర విషయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవటంతో వేసవిలో మండల గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాన్నారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ మీడియా సెల్ కోఆర్డినేటర్ రొక్కాల సత్తిబాబు, మండల పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు పోతుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

మండపేట: మండపేట మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఐ. రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆమోదం కోసం సభ్యుల ముందుంచుతామన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

నాసిరకం నిర్మాణాలతో ప్రజలకు ఇక్కట్లు

- ప్రభుత్వంపై బురద జల్లేందుకు అసత్య ప్రచారం
- టిడ్కో ప్లాట్లను సందర్శించిన చైర్‌పర్సన్ దుర్గారాణి


టిడ్కో ప్లాట్ల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు తదితరులు

మండపేట: ధనార్జనే ధ్యేయంగా గత టీడీపీ ప్రభుత్వం నాసిరకంగా నిర్మించిన టిడ్కో ప్లాట్లలో నివసించేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. వారి లోపాలను కప్పిపుచ్చుకుని ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం టిడ్కో ప్లాట్లను సందర్శించిన సందర్భంగా కనీస వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మంగళవారం అధికారులతో కలిసి టిడ్కో ప్లాట్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. వాటర్ ట్యాంకు సమీపంలోని అపార్ట్‌మెంట్ల వారికి నీటి సమస్య లేదని, దూరంగా ఉన్న వాటికి అప్పుడప్పుడూ కొరత వస్తోందని స్థానికులు తెలిపారు. శానిటరీ, వాటర్ పైప్‌లైన్లు తరచూ మూసుకుపోతున్నాయని, అపార్ట్‌మెంట్ పై ఉన్న ట్యాంకుల నుంచి నీరు లీకైపోతోందని తెలిపారు. వర్షం వస్తే ప్లాట్లలోకి జల్లు వచ్చేసి గదులు, బయట వరండా మొత్తం తడిసి పోతోందని, కొద్దిపాటి ఎండకే గది లోపల ఉండలేనంతగా వేడి వస్తోందని వాపోయారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మన పరిస్థితులకు అనుకూలించని షీర్ వాల్ టెక్నాలజీ పేరిట కాంక్రీట్ గోడలతో ప్లాట్లు నిర్మించి పేదలను నట్టేట ముంచారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన నాసిరకం నిర్మాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఎమ్మెల్యే వేగుళ్లను ప్రశ్నించారు. పేదవర్గాల వారికి ఊరట నిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 300 చదరపు అడుగుల ప్లాట్ల లబ్ధిదారులకు పూర్తి ఉచితంగాను, 365, 430 చదరపు అడుగుల ప్లాట్ల లబ్ధిదారులకు వారు చెల్లించిన డిపాజిట్ మొత్తంలో 50 శాతం సొమ్మును వాపసు ఇస్తున్నారని రాజుబాబు వివరించారు. ప్రస్తుతం రంజాన్ మాసం అయినందున నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని ఆ మేరకు సమస్య లేకుండా చూడాలని స్థానికులు, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ విజ్ఞప్తి చేశారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ టి రామ్‌కుమార్‌కు చైర్‌పర్సన్ దుర్గారాణి సూచించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను నిరోధించండి


తణుకువాడ పంట పొలాల మధ్య సంచరిస్తున్న కోతులు

కాజులూరు: మండలంలోని తణుకువాడలో ఇటీవల కోతులు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ రైతులను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. వీధుల్లో అవి హల్‌చల్ చేస్తుంటే స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొబ్బరిచెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారవేయడంతో పాటు కూరగాయలు, పూలతోటలపై దాడి చేస్తున్నాయని దీంతో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామ వీధుల్లో సంచరిస్తు ఇళ్లపై అవి పరుగులు తీస్తుండటంతో తాటాకు ఇల్లు, పెంకుటిళ్ల పైకప్పులు జారి పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు మహిళలు, ఇంటిలో నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులపైనా కోతులు దాడి చేస్తాయని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు కోరింగ అభయారణ్యం దగ్గర కావటంతో అక్కడి నుంచి కోతుల గుంపులుగా గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాలను నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోవిడ్ కేసులపై అప్రమత్తంగా ఉండాలి


దంగేరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కోవిడ్ కేసులపై అప్రమత్తంగా ఉండి వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) యం.దుర్గారావు దొర సూచించారు. మండలంలోని పేకేరు, దంగేరు పీహెచ్‌సీలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పేకేరు పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల నమోదైన మూడు కోవిడ్ కేసుల సమాచారం తెలుసుకుని సిబ్బందికి సూచనలు చేశారు. దంగేరు పీహెచ్‌సీలో మాతా శిశు ఆరోగ్యంపై ఆన్‌లైన్ డేటాను పరిశీలించి సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్ అనుమానిత లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి పరీక్షలు చేయించి వైద్యం అందించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు దేవకుమార్, పి.ఉదయశ్రీ, సూపర్‌వైజర్ వైఎస్ఎస్ మూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు ఉచితంగా విద్య


రామచంద్రరావు, ఎంఈఓ

మండపేట: విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రభుత్వం పేదలకు ప్రైవేట్ స్కూళ్లల్లో ఉచితంగా విద్యను అందిస్తుందని మండల విద్యాశాఖాధికారి ఎస్.రామచంద్రరావు అన్నారు. అందుకోసం అర్హత కలిగిన వారు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి ప్రైవేట్ స్కూల్‌లో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించాలన్నారు. అందుకోసం అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఏటా 1వ తరగతి నుంచి ప్రవేశాలు ఉంటాయన్నారు. దరఖాస్తుదారులకు లాటరీ ద్వారా స్కూళ్లను కేటాయిస్తారని, ఏ విద్యార్థికి ఏ స్కూల్లో అవకాశం వస్తుందో ఎవరికీ తెలియదని వివరించారు. రూ. 12 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన వారు ఈ పథకానికి అర్హులన్నారు. మీ సేవ కేంద్రం ద్వారా తల్లిదండ్రులు విద్యార్థి వివరాలను రిజిస్టర్ చేయించాలని ఎంఈఓ రామచంద్రరావు సూచించారు.

మసీదు స్థలంలో నిర్మాణం ఆపాలి

కమిషనర్‌ను కోరిన వైఎస్సార్ సీపీ నేత సయ్యద్ రబ్బానీ


మసీదు స్థలంలో పనులు ఆపాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ నేత రబ్బానీ. చిత్రంలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: పట్టణంలోని జామియా మసీదు స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులను వెంటనే నిలుపు చేయించాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత సయ్యద్ రబ్బానీ డిమాండ్ చేశారు. మసీదు స్థలంలో నిర్మాణాలు ఆపాలని వక్ఫ్ బోర్డు అధికారులు భవన యజమానులకు నోటీసు ఇచ్చినా పనులు చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వివరించారు. మసీదు స్థలం ఆక్రమించి పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలంలో నిర్మాణంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో రబ్బానీ ముస్లిం పెద్దలతో మంగళవారం కమిషనర్ రామ్‌కుమార్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. మసీదు స్థలం డాక్యుమెంట్లు అందజేయాలని కమిషనర్ రామ్‌కుమార్ సూచించారు. పూర్వపు కట్టడాలకు సంబంధించి డాక్యుమెంట్లు ఉండవని, వక్ఫ్ బోర్డు రికార్డుల్లో నమోదై ఉన్న వివరాలు అందజేస్తామని రబ్బానీ తెలిపారు.

పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ల

అంతకు ముందు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మసీదు స్థలాన్ని పరిశీలించి ముస్లిం పెద్దలను సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ రామ్‌కుమార్‌తో మాట్లాడారు. ప్లాన్ లేకుండా నిర్మాణం చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. భవన యజమానులు ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, పరిశీలనలో ఉందని కమిషనర్ వివరించారు. ప్లాన్ ఇచ్చేంత వరకూ పనులు నిలుపుచేయించాలని ఎమ్మెల్యే వేగుళ్ల సూచించారు. అల్తాఫ్, మైనర్‌బాబు, ఎంఆర్‌పీఎస్ నేత దూలి జయరాజు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగన్ లక్ష్యం

ఆసరా సమావేశాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


వెదురుపాకలో డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: రాష్ట్రంలోని మహిళలందరినీ లక్షాధికారులను చేయడంతో పాటు, వారికి సాధికారత కల్పించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని నదురుబాద, వెదురుపాక, వి.సావరం, రాయవరం, లొల్ల, సోమేశ్వరం గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ ఆసరా సమావేశాలు నిర్వహించారు. ఆయా పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాయవరం, లొల్ల, సోమేశ్వరం సమావేశాల్లో కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కూడా మాట్లాడారు. ఎంపీడీవో డి. శ్రీనివాసు మాట్లాడుతూ ఆరు గ్రామాల్లో మూడు విడతల్లో రూ.17.43 కోట్లు డ్వాక్రా సంఘాలకు మంజూరు చేశామన్నారు. ఆయా పంచాయతీల సర్పంచులు చింతపల్లి శ్రీనివాసరావు, మల్లిడి సూరారెడ్డి, కాకి కృష్ణవేణి, చంద్రమళ్ల రామకృష్ణ, చాట్రాతి జానకి, ఆరిఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ యువ నేత తోట పృథ్వీ, ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, రాయవరం, లొల్ల గ్రామాభివృద్ధి కమిటీల చైర్మన్లు తేతల సుబ్బరామారెడ్డి, చేవా సత్యనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు చిన్నం అపర్ణ, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాజర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి

ఆలమూరు: బాలబాలికలు, చిన్నారుల అభ్యున్నతికి, మానవహక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జి.చిన్నదుర్గ అన్నారు. ఆలమూరులోని ఎస్టీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వి.సరోజారాణి ఆధ్వర్యాన నిర్వహించిన బాలల హక్కుల రక్షణపై మహిళలకు అవగాహన సదస్సు జరిగింది. బాల్య వివాహాలు నిరోధించాలని, బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎస్.నీలిమ, పారా సంస్థ ప్రతినిధులు నల్లా సూర్యప్రకాష్, దుర్గాప్రసాద్, సాయిశ్రీ పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు ఉత్పత్తిని పునః ప్రారంభించాలి


నెలపర్తిపాడు చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ మధుసూదన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు(చెత్త నుంచి సంపద కేంద్రం) నుంచి వర్మీ కంపోస్టు ఉత్పత్తిని పునః ప్రారంభించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి మధుసూదన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డీపీఓ మంగళవారం ఈ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చారు. గ్రామ సచివాలయ నిర్మాణం కోసం చెత్త నుంచి సంపద కేంద్రానికి దారి మూసివేయడంతో తాత్కాలికంగా వర్మికంపోస్టు ఉత్పత్తి నిలిచిపోయిందని స్థానిక అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం మార్గం తిరిగి తెరచుకున్న నేపథ్యంలో వర్మీకంపోస్టు ఉత్పత్తిని ప్రారంభించాలని డీపీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ఏపీఓ జి.అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి బి.నారాయణాచార్యులు, రాయుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లిపాలెంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

అయినవిల్లి: వీరవల్లిపాలెంలో వివాదంలో ఉన్న రహదారిని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్, కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ మంగళవారం పరిశీలించారు. వివాదానికి కారణమైన విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

డిజర్ట్ ఫొటోగ్రఫీలో తృతీయ బహుమతి


రాజస్తాన్‌లో తృతీయ బహుమతి అందుకుంటున్న సీవీ రావు

మలికిపురం: రాజస్తాన్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన 11వ జేపీఎస్ డిజర్ట్ ఫొటోగ్రఫీ వర్క్‌షాపులో మలికిపురానికి చెందిన ఫొటోగ్రాఫర్ సీవీ రావు ఫొటోకు తృతీయ బహుమతి దక్కింది. వివరాలను ఆయన మంగళవారం తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్స్ ఈ వర్క్‌షాపులో పాల్గొన్నట్టు, ఏపీ నుంచి తనకు ఈ గౌరవం దక్కినట్టు సీవీ రావు తెలిపారు.

నేడు వారపు సంత నిర్వహించవద్దు

అంబాజీపేట: అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో బుధవారం నిర్వహిస్తున్న వారపు సంతలో చెత్తను తొలగించని కారణంగా మార్కెట్ నిర్వహించవద్దని సోమవారం జరిగిన స్పందనలో అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే సంతకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులకు ముందస్తుగా తెలియపరిచేందుకు బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను కూరగాయలు, చేప, మాంసం విక్రయాలు జరపనివ్వమని కొర్లపాటివారిపాలెం వాసులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జీవీవీఎస్ కుమార్‌ను వివరణ కోరగా బుధవారం జరిగే వారపు సంతలో కూరగాయల దుకాణాలు వేసుకోవచ్చని, ఎటువంటి మాంసం, చేపల విక్రయాలు జరపనివ్వమన్నారు. మాంసం, చేపల విక్రయాలు జరిపేతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు రుచికరంగా వండాలి

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ సంతృప్తిగా తినేలా మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతగా వండాలని జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, వడ్డింపుతో పాటు భోజనాన్ని ఆమె రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా? అంటూ భోజనంలో నాణ్యత లోపాన్ని గురించి ఏజెన్సీ నిర్వాహకురాలిని ప్రశ్నించారు. ఏదో మొక్కుబడిగా వండి, వడ్డించడం సరికాదు కదా? అని హితవు పలికారు. పాఠశాలలో విద్యార్థులందరూ సంతృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందన్నారు. ఇకపై వంటలో తగిన మెళకువలు తెలుసుకుని వండాలని రమాదేవి సూచించారు. పథకం నిర్వహణను ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యత లేమిపై నిర్వాహకురాలికి అధికారులు నోటీసు ఇచ్చారు. ఈ తనిఖీలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్‌ఎం క్రిస్టఫర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఏప్రిల్‌లో సాధించినవలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలను అందజేశారు.